రేపు జాతీయ లోక్ అదాలత్

కర్నూలు(లీగల్), సెప్టెంబరు 12: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని కోర్టులలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ధి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, రాజీకి వీలున్న క్రిమినల్ కేసులు, ప్రి లిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవచ్చని వారు ఆ ప్రకటనలో తెలిపారు.

- మూత్రశాలలు అంతంత మాత్రమే
- చిన్నారుల ఆరోగ్యం పట్టని యాజమాన్యాలు
- తనిఖీలు మరిచిన అధికారులు

కన్నీటి వ్యథ



నంద్యాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి):

నంద్యాలకు చెందిన ఓ విద్యార్థిని కడుపు నొప్పితో బాధపడుతూ ఆస్పత్రికి వెళ్లింది. వైద్యులు పరీక్షించి రోజూ సరిగా నీరు తాగకపోవటం వల్ల ఇన్‌ఫెక్షన్ సోకిందని, అందువల్లే ఇలా అయిందని అన్నారు.

గోస్పాడు మండలానికి చెందిన ఓ బాలుడు నంద్యాలలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. వయసుకు తగ్గ ఎత్తు, బరువు లేకపోవడంతో విద్యార్థి తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. వైద్యులు పరీక్షించి ఆహారం సక్రమంగా తీసుకోకపోవడం వల్ల మిటమిన్ల లోపం తలెత్తిందని, సరైన ఆహారం తీసుకుంటే సరిపోతుందని చెప్పారు.

ఎక్కడా కానరాదే..

ప్రస్తుత పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల చదువు తప్ప వేరే వాటిని పట్టించుకోకపోవటం లేదు. దీంతో విద్యార్థులు చదువు హడావుడిలో పడి తిండి సక్రమంగా తినటంపైన, ముఖ్యంగా నీరు తాగటంపైన శ్రద్ధ పెట్టడం లేదు. ఇంటి నుంచి భోజనం క్యారియర్‌తో పాటు పాఠశాలకు తీసుకువెళ్లిని నీళ్ళ బాటిళ్లను సగానికి సగం కూడా తాగకుండానే విద్యార్థులు వెనక్కి తీసుకెళు తున్నారు. క్రమేణా విద్యార్థులు నీరు తాగే అలవాటుకు దూరమవుతున్నారు. ప్రతి మనిషి రోజుకు కనీసం ఆరు లీటర్ల నీరు తప్పనిసరిగా తాగాలి. అలా కానీ పక్షంలో శరీరం డీ హైడ్రేషన్‌కు గురవటమే కాకుండా, అనేక రకాల ఇన్‌ఫెక్షన్లు సోకుతాయి. ముఖ్యంగా యూరిన్ ఇన్‌ఫెక్షన్ వల్ల విపరీతమైన కడుపు నొప్పి కూడా వస్తుంది. అంతేకాకుండా విద్యార్థినుల్లో ఇతర రకాల ఇబ్బందులు కూడా తలెత్తే అవకాశముంది. అయితే చాలా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు చదువు, పరీక్షలు, ఫలితాల మీద పెట్టిన శ్రద్ధ విద్యార్థుల ఆరోగ్యంపై పెట్టకపోవటంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. ఇదేమిటని విద్యార్థుల తల్లిదండ్రులు అడుగుదామంటే.. తమ పిల్లలను ఎక్కడ వేధిస్తారోనని మిన్నకుండిపోతున్నారు. తీరా తమ పిల్లల ఆరోగ్యం పాడైపోయాక కానీ జరిగిన అనర్థమేమిటో అర్థం చేసుకోలేకపోతున్నారు. విద్యార్థుల్లో ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పాఠశాలల్లో వాటర్ బెల్ అనేది పాటిం చాలని, తద్వారా విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుం డా చూడా ల్సిన బాధ్యత పాఠశాలల యాజమా న్యాలదేనన్న అభిప్రాయం వినిపిస్తోంది.

పై రెండు ఉదాహరణలు ప్రస్తుతం పాఠశాలల్లో విద్యార్థుల పరిస్థితి ఏమిటో తెలియజేస్తాయి. పాఠశాలల్లో సరైన తాగునీటి, మూత్రశాలల సదుపాయం లేక ఇన్‌ఫెక్షన్ల బారిన పడే విద్యార్థులు కొందరైతే, పాఠశాలల వేళల వల్ల సరైన ఆహారం తీసుకునే సమయం లేక అనారోగ్యం పాలవుతున్న విద్యార్థులు మరికొంతమంది. విద్యాశాఖలో పర్యవేక్షణ లేకపోవటంతో ప్రైవేటు పాఠశాలలు తమ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాయి. దీంతో ఆరోగ్యంతో, ఆటపాటలతో కళకళలాడాల్సిన బాల్యం వసివాడిపోతోంది.



మూత్రశాలలు ఏవి..?

జిల్లా వ్యాప్తంగా దాదాపు 550 వరకు ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలు ఉండగా, వీటిలో దాదాపు ఒక లక్షా 10 వేల మంది విద్యార్థులు చదువు కొనసాగిస్తున్నారు. ఏ పాఠశాలను తీసుకున్నా కనీసం 500 మందిపైగా విద్యార్థులు ఉంటున్నారు. అయితే విద్యార్థుల సంఖ్యకు తగినట్లు ఏ పాఠశాలలోనూ మూత్రశాలలు ఉండటం లేదు. ప్రతి మొదటి సెక్షన్‌కు 60 మంది విద్యార్థులు, రెండో సెక్షన్‌కు 40 మంది విద్యార్థులు ఉండాలి. క్లాసు రూములు, విద్యార్థుల సంఖ్యలో నిబంధనలు పాటించడం లేదు. మూత్రశాలల ఏర్పాటులో పాఠశాలల యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ఒక క్లాసుకు రెండు మూత్రశాలలు ఉండాలి. బాలికలు, బాలురకు వేరు వేరుగా ఉండాలి. కానీ ఇలా జరగటం లేదు. పాఠశాల మొత్తమ్మీద రెండు లేదా మూడు మూత్రశాలలు మాత్రమే ఉంటున్నాయి. పైగా ఇవి ఏ మాత్రం శుభ్రంగా ఉండవన్నది జగమెరిగిన సత్యం. దీనివల్ల విద్యార్థులు పాఠశాల సమయాల్లో మూత్ర విసర్జన చేయకుండా ఇంటికి వెళ్లేంత వరకు అలాగే ఉంటున్నారు. ఎక్కువ సార్లు నీరు తాగితే ఎక్కువ సార్లు మూత్రశాలకు వెళ్లాల్సి వస్తుందన్న కారణంగా చాలామంది విద్యార్థులు నీటిని తాగటం మానేస్తున్నారు. ఇవన్నీ వెరసి విద్యార్థులను అనారోగ్యం బారిన పడేస్తున్నాయి.

విటమిన్ల లోపం..

సాధారణంగా ఆహారం సరిగా అందని, పేద, మురికి వాడల్లోని పిల్లలు, ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలు పౌష్టికాహార లోపంతోనూ, శరీరానికి విటమిన్ల కొరతతోనూ బాధపడుతుంటారు. కానీ అనూహ్యంగా ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల విద్యార్థులు కూడా ఈ మధ్య మిటమిన్ల కొరతను ఎదుర్కొంటున్నారన్న అభిప్రాయం వైద్యుల నుంచి వ్యక్తమవుతోంది. దీనికంతటికీ కారణం.. ఆయా పాఠశాలల్లోని విద్యార్థులు సక్రమంగా తిండి తినకపోవటమేనని తెలుస్తోంది.

పట్టించుకునే తీరికేది..?

ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల తీరు తెన్ను ఎలా ఉంది? నిర్వహణ ఎలా సాగుతోంది? అనే విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. ప్రతి నెలా ఓ 20 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేయాలి. దీనికి సంబంధించి పూర్తి కార్యక్రమాన్ని టూర్ ప్రోగ్రామ్‌గా పై అధికారులకు అందజేయాలి. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో వీటి విషయం ఆయా పాఠశాలలకు ముందే తెలియటంతో వాటి యాజమాన్యాలు అప్రమత్తమవుతున్నాయి. అధికారులు వచ్చే ముందు అన్నీ ఉన్నట్లుగా చూపుతున్నారు. కొన్ని పాఠశాలల యాజమాన్యాలతో అధికారులు కుమ్మక్కు కావటంతో వాటిల్లో సరైన సౌకర్యాలు లేకపోయినా ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల ఆటలు సాగుతున్నాయి. అధికారుల మామూళ్ల వ్యవహారం, ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల తీరు వెరసి విద్యార్థుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి.



ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల బస్సులు విద్యార్థులను తీసుకువెళ్లేందుకు ఉదయం 7 గంటల నుంచి 7.30 గంటల మధ్య వచ్చేస్తున్నాయి. ముఖ్యంగా పల్లెల నుంచి వచ్చే బస్సులు ఈ సమయానికే వస్తుంటాయి. దీంతో ఉదయాన్నే లేచి సగం నిద్రముఖంతోనే పాఠశాల బస్సును ఎక్కుతున్నారు. దీంతో సరిగా తిండి తినకుండా ఖాళీ కడుపులతోనే పాఠశాలకు వెళుతున్నారు. ఇక మధ్యాహ్నం అన్నం తినే సమయం కూడా 45 నిముషాలకు అటూ ఇటూ ఉంటోంది. కాస్త నిదానంగా తినే పిల్లలు ఆ సమయంలో బాక్సులోని అన్నం తినటం పూర్తి చేయలేకపోతున్నారు. ఇలా చాలామందికి వారికి కావాల్సిన పోషకాలు అందక ఇబ్బంది పడుతున్నారు. ఈ తీరు మారాలంటే ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల తీరులో మార్పుతో పాటు, వాటిని పర్యవేక్షించాల్సిన అధికారులు సరిగా ఉంటేనే రేపటి తరం బలంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నీటి శాతం తగ్గితే తీవ్ర ప్రభావాలు



ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారంతోపాటు తగు మోతాదులో నీరు తాగాలి. మరి ముఖ్యంగా చిన్న పిల్లలు, పాఠశాల విద్యార్థుల శరీరంలో నీటి శాతం తగ్గితే అనారోగ్యం బారిన పడతారు. లవణాలు తగ్గి కండరాల నొప్పులు, శరీర బలహీనత, కడుపునొప్పి, జీర్ణాశయంపై ప్రభావం తదితర సమస్యలు ఉత్పన్నమవతాయి.

-డా. సుధాకర్, ప్రభుత్వ వైద్యుడు, చిన్నపిల్లల వ్యాధి నిపుణుడు, నంద్యాల

తీవ్ర అనారోగ్యానికి గురవుతారు



విద్యార్థుల శరీరంలో నీటిశాతం తగ్గితే తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదురవుతాయి. గంటకోసారి ఫిల్టర్ వాటర్‌గాని, కాచి చల్లార్చిన నీరుగాని తాగాలి. నీటి శాతం తగ్గితే డీహైడ్రేషన్‌కు గురవుతారు. శరీరానికి అవసరమైన లవణాలు తక్కువ కావడంతో కండరాల నొప్పులు, నీరసంగా ఉండటం, చదువు, క్రీడలపై ఆసక్తి ఉండకపోవడం తదితర సమస్యలు తలెత్తుతాయి.

-డా. రాకేష్‌రెడ్డి, ప్రముఖ చిన్న పిల్లల వ్యాధి నిపుణుడు, నంద్యాల



లోకాయుక్తపై విస్తృత ప్రచారం అవసరం

- చట్టాలపై ప్రజల్లో చైతన్యం రావాలి
- సమస్యల్లో 50 శాతం రెవెన్యూశాఖవే
- ఐదేళ్ల కాలంలో రూ.101 కోట్ల ప్రజాధనం రికవరీ
- లోకాయుక్త జస్టిస్ పి. లక్ష్మణరెడ్డి




కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), సెప్టెంబరు 12: లోకాయుక్తపై ప్రజల్లో సరైన అవగాహన కొరవడిందని, దీనిపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించి, వారిని చైతన్యుల్ని చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి అన్నారు. నగరంలోని సంతోష్‌నగర్‌లోని లోకాయుక్త కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. జస్టిస్ లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ లోకాయుక్త అనేది న్యాయస్థానం కాదని, ఇది ప్రజా సమస్యల ఫిర్యాదులకు సంబంధించిన పరిష్కార వేదిక అని అన్నారు. అత్యంత తక్కువ ఖర్చుతో లోకాయుక్తలో బాధితులకు పరిష్కారం లభిస్తోందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 2011 సంవత్సరంలో లోకాయుక్త సవరణ చట్టంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని జస్టిస్ లక్ష్మణరెడ్డి అన్నారు. ప్రజాధనం వృథా, నిధుల దుర్వినియోగంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు విధుల్లో బాధ్యతరాహిత్యం, ప్రజాప్రతినిధుల అలసత్వం తదితర అంశాలను సైతం తమ పరిధిలో పరిష్కారం చూపే వెసులుబాటు లభించిందన్నారు. ప్రజలు గతంలో మాదిరిగా ప్రత్యక్షంగానో, పోస్టు ద్వారానో సమస్యలను విన్నవించడమే కాక, వారి సౌలభ్యం కోసం నూతనంగా అన్‌లైన్‌లోనూ సమస్యలను నమోదు చేసే విధానం అమలులో ఉందని చెప్పారు. గతంలో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు మాత్రమే తమ దృష్టికి అధికంగా వచ్చేవని, ప్రస్తుతం పత్రికల్లో వచ్చిన కథనాలు, వార్తలను సైతం ఎక్కువగా సుమోటా తీసుకుని పరిష్కారం చూపినట్లు జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి తెలిపారు. తన ఐదేళ్ల పదవి కాలంలో మొత్తం రూ.101 కోట్లు ప్రజాధనాన్ని రికవరీ చేశామని, సమస్యల్లో 50 శాతం వరకు రెవెన్యూ శాఖకు సంబంధించి భూ వివాదాలే ఉంటున్నాయని చెప్పారు. 22(1)ఎ చట్టంతో ఈ సమస్యలు మరింత పెరిగాయని, దీని వల్ల రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. కోస్తా ప్రాంతంలో లోకాయుక్తపై కొంత అవగాహన ఉందని, రాయలసీమ ప్రజలను దీనిపై చైతన్యుల్ని చేసి లోకాయుక్త సేవలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ మధ్య కాలంలో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు ఎక్కువయ్యాయని అన్నారు. తాడిపత్రిలో పెన్నానది ఆక్రమణకు గురై 1700 అక్రమ నిర్మాణలు వెలిశాయని, ప్రభుత్వ పాఠశాల సైతం ఇక్కడ నిర్మించటం విడ్డూరమని అన్నారు. పుట్టపర్తిలోని చిత్రావతి నదిలో ఇటువంటి పరిస్థితి చోటు చేసుకుందని, వీటిపై తమ పరిధిలో సంబంధిత జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశామని జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి తెలిపారు. తన హయాంలో విద్యుత్ బాధిత కుటుంబాలకు తక్షణ సాయం, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయినికి అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలు, రహదారి విస్తరణలో స్థలం కోల్పోయిన వృద్ధురాలికి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. చట్టాలపై ప్రజల్లో అవగాహన ఉండాలని సూచించారు. ఈనెల 14న తన పదవి విరమణ ఉంటుందని, ప్రజా ఫిర్యాదులకు సంబంధించి తదుపరి ఉప లోకాయుక్త బాధ్యతలు తీసుకుంటారని చెప్పారు. కర్నూలులో కార్యాలయం ఏర్పాటు చేశాక కేవలం ఒక్క కర్నూలులోనే 1321 ఫిర్యాదులు వచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో లోకాయుక్త రిజిస్ట్రార్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ల్యాబ్ నిర్వాహకుడిపై వైసీపీ నేత దాడి

ప్యాపిలి, సెప్టెంబరు 12: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో రక్తపరీక్షల ల్యాబ్ నిర్వహిస్తున్న జయక్రిష్ణపై గురువారం వైసీపీ నేత చిన్నసుంకయ్య దాడి చేశారు. చిన్నసుంకయ్య కూడ క్లీనిక్, ల్యాబ్ నిర్వహిస్తున్నారు. తమ క్లీనిక్‌కు వచ్చిన పేషెంట్ జయక్రిష్ణ ల్యాబ్‌కు వెళ్లడంతో ఆయన పరీక్షలు చేశాడు. దీంతో చిన్నసుంకయ్య తమ క్లీనిక్ సంబంధించిన పేషెంట్‌కు ఎలా పరీక్షలు చేస్తావంటూ దాడి చేశాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీసులు స్పందించారు. బాధితుడు జయక్రిష్ణ ఫిర్యాదు మేరకు సీఐ వెంకటరామిరెడ్డి వైసీపీ నేతపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీశైలం జలాశయం గేటు ఎత్తివేత



శ్రీశైలం, సెప్టెంబరు 12: శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. గురువారం జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగడంతో డ్యాం అధికారులు జలాశయం ఒక క్రస్టు గేటును తెరిచి దిగువ నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేశారు. జూరాల నుంచి 65,278 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 20,196 క్యూసెక్కులు మొత్తం 85,474 వరద నీరు వస్తున్నది. జలాశయం ఒక క్రస్టుగేటు ఎత్తి 27,846 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ జలాశయానికి విడుదల చేస్తున్నారు. గురువారం రాత్రి 9 గంటల సమయానికి జలాశయానికి 1,31,543 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 884.50 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 212.9198 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 31,152 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,116 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 12: పీఎం ఆవాస్ యోజన కింద ఇళ్ల నిర్మాణాల ప్రగతి అధ్వాన రీతిలో ఉందని పనితీరు మెరుగుపరుచుకొని ఈ వారంలో పురోగతి తీసుకురావాలని కలెక్టర్ రాజకుమారి హౌసింగ్ ఏఈ, డీఈలను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గృహ నిర్మాణాల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఇళ్ల నిర్మాణంలో భాగంగా ప్రతి రోజు పది ఇళ్ల స్టేజ్ కన్వర్షన్ స్థాయికి తీసుకురావాలని ఆదేశించినప్పటికీ అధికారులు శ్రద్ధ చూపకపోవడం బాధాకరమన్నారు. పీఎం ఆవాస్ యోజన కింద 2,600 గృహాలు లక్ష్యానికి గాను కేవలం 243 మాత్రమే పూర్తి చేసి 9శాతం సాధించారని కలెక్టర్ అన్నారు. నందికొట్కూరు, పాములపాడు, ఆత్మకూరు, ప్యాపిలి, బెతంచెర్ల, మిడుతూరు, జూపాడుబంగ్లా తదితర మండలాలో జీరో శాతం కూడా సాధించలేదన్నారు.

స్వచ్ఛతే సేవ.. చేపట్టండి

ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వతేదీ వరకు అన్ని గ్రామాలలో స్వచ్ఛతే సేవ కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో అవగాహన తీసుకురావాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయం నుండి రాష్ట్ర ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ స్వచ్ఛతే సేవ కార్యక్రమాల అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. చాంబర్ నుండి కలెక్టర్ రాజకుమారి, డీపీఓ మంజులవాణి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకం వినాయకుడికి పట్టు వస్త్రాలు

శ్రీశైలం, సెప్టెంబరు 12: గణేశ్ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామికి శ్రీశైలం దేవస్థానం తరపున పట్టువస్త్రాలను గురువారం సమర్పించారు. శ్రీశైలం దేవస్థానం తరఫున కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు, అర్చకులు, వేదపండితులు, పలువురు అధికారులు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామికి పట్టువస్త్రాలను సమర్పించారు. కాణిపాక దేవస్థానం కార్యనిర్వహణాధికారి పి. గురుప్రసాద్, అర్చకులు, వేదపండితులు కలిసి శ్రీశైలం దేవస్థానం అధికారులకు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు.



పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న ఈవో పెద్దిరాజు, అర్చకులు, అధికారులు

విద్యుదాఘాతంతో రైతు మృతి

పాణ్యం, సెప్టెంబరు 12: మండలంలోని తొగర్చేడు వద్ద నంద్యాల మండలం చాపిరేవుల గ్రామానికి చెందిన సాడెం బలరాముడు (54) అనే రైతు విద్యుదాఘాతంతో మృతి చెందారు. పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపిన వివరాలివీ.. బలరాముడు గురువారం పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లారు. విద్యుత్ స్టార్టర్ స్విచ్ వేయగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందారు. రైతుకు భార్య తిరుపాలమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ఐదేళ్లుగా ఎదురుచూపులే!



- రాయితీ సూక్ష్మపోషకాల కోసం అన్నదాతల ఎదురు చూపు
- గత వైసీపీ ప్రభుత్వంలో పంపిణీకి తిలోదకాలు
- 33,441 మెట్రిక్ టన్నుల సూక్ష్మపోషకాలకు ప్రతిపాదనలు
- టీడీపీ ప్రభుత్వంపై సన్న, చిన్నకారు రైతుల ఆశలు

శిరివెళ్ల, సెప్టెంబరు 12: వ్యవసాయంలో మొక్కలకు సూక్ష్మపోషకాలు బలాన్ని అందిస్తాయి. భూమిలో ఇతర పోషకాలు తగిన మొత్తంలో ఉన్నప్పటికీ.. సూక్ష్మ పోషకాలు, స్థూల మూలకాలు లోపిస్తే మొక్క పెరుగుదల ఆగిపోతుంది. దిగుబడి తగ్గిపోతుంది. దీనికి పరిష్కారంగా ప్రభుత్వం జిప్సమ్, బోరాన్, జింక్ తదితర సూక్ష్మపోషకాలను రాయితీపై అందిచాల్సి ఉంది. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో సూక్ష్మపోషకాలపై రాయితీ దక్కలేదు. ఆర్బీకేల ద్వారా పంపిణీ చేయకపోవడంతో అధిక ధరలు వెచ్చించి రైతులు ప్రైవేటు దుకాణాల్లో కొని నష్టపోయారు. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం సూక్ష్మపోషకాలు పంపిణీ చేస్తుందని చిన్నకారు రైతులు ఆశ పెట్టుకున్నారు. అదనపు ఖర్చు లేకుండా పంట సాగు చేయవచ్చని అనుకుంటున్నారు.

అన్నదాతల్లో చిగురిస్తున్న ఆశలు

నంద్యాల, కర్నూలు జిల్లాల్లో ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కేసీ కెనాల్, తెలుగుగంగ, హంద్రీనీవా తదితర కాల్వల సాగునీరు ప్రధాన వనరుగా రైతులు వ్యవసాయం చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతులు ఏటా ఖరీఫ్‌లో 6.5 లక్షల హెక్టార్లలో, రబీ సీజన్‌లో 3.4 లక్షల హెక్టార్లలో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు నిర్వహించుకుని వాటికి అనుగుణంగా సేంద్రియ, రసాయన ఎరువులను వినియోగించాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఇందులో ప్రధానంగా భూమిలో సూక్ష్మపోషకాల లోపం ఏర్పడితే పంటల దిగుబడిపై ప్రభావం చూపుతుంది. గత వైసీపీ ప్రభుత్వంలో పెరిగిన ఎరువుల ధరలు, తగ్గిన దిగుబడి ధరలతో రైతులకు వ్యవసాయం భారంగా మారింది. రైతులకు రాయితీపై ఎలాంటి పథకాలు అందించకపోవడంతో అప్పులపాలైన అన్నదాతలు బలవన్మరణాలకు పాల్పడ్డారు. గతంలో టీడీపీ హయాంలో రైతులకు భారం లేకుండా సూక్ష్మపోషకాలను యాభై నుంచి వంద శాతం రాయితీపై పంపిణీ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో వైసీపీ గ్రహణం వీడి టీడీపీ అధికారంలోకి రావడంతో అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. నేలకు, పంటకు జీవం పోసే సూక్ష్మపోషకాల పంపిణీ కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.



సూక్ష్మపోషకాల ఆవశ్యకత :

- పంట పునరుత్పత్తి, అమైనో యాసిడ్ ఉత్పత్తి, సెల్ గోడ నిర్మాణంలో బోరాన్ తోడ్పడుతుంది. పిండి పదార్థాల రవాణా ద్వారా పంట నాణ్యతను మెరుగుపరచడంలో కీలకంగా పని చేస్తుంది. నేలలో బోరాన్ లోపిస్తే ఆకుల వైకల్యం, ఆకులపై ముదురు గోధుమ రంగు గుర్తులు ఏర్పడతాయి. ఆకులు పసుపు రంగులోకి మారతాయి. పంటల్లో పుష్పించే దశకు ముందు బోరాన్ వేయాల్సి ఉంటుంది.
- కిరణజన్య సంయోగక్రియ ప్రక్రియ, మొక్కల హార్మోన్లను సమతుల్యం చేయడంలో జింక్ దోహదపడుతుంది. ఎంజైమ్‌లను ఉత్ప్రేరణ చెందించడంలో సహాయపడుతుంది. నేలలో జింక్ లోపం వల్ల మొక్కల ఎదుగుదల మందగించడం, ఇంటర్నోడ్‌ల పొడవు తగ్గడం, చిన్న చిన్న ఆకులు ఏర్పడడం, దిగువ ఆకులపై పసుపు రంగు వస్తుంది.
- మొక్కల్లో మాంసకృత్తులు, కేంద్రకామ్లాలు, అమైనో ఆమ్లాల తయారీలో స్థూల మూలకమైన నత్రజని దోహదపడుతుంది. నేలలో నత్రజని లోపిస్తే మొక్కల్లో పెరుగుదల ఆగిపోతుంది. పత్రాలు సైతం పసుపు రంగులోకి మారుతాయి.

33,441 మెట్రిక్ టన్నులకు ప్రతిపాదనలు

నంద్యాల జిల్లా పరిధిలోని రైతులకు 33,441 మెట్రిక్ టన్నుల సూక్ష్మపోషకాల అవసరం ఉందని ఆయా మండలాల నుంచి సేకరించిన సమాచారాన్ని జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. ఇందులో జింక్ 21 పర్సెంటేజ్ 6,100 మెట్రిక్ టన్నులు, 33 పర్సెంటేజ్ 23 మెట్రిక్ టన్నులు, 12 పర్సెంటేజ్ 30 మెట్రిక్ టన్నులు కావాలని ప్రతిపాదించారు. అలాగే జిప్సమ్ అత్యధికంగా 26,070 మెట్రిక్ టన్నులు, బోరాన్ 10.5 పర్సెంటేజ్ 107 మెట్రిక్ టన్నులు, 20 పర్సంటేజ్ 1,111 మెట్రిక్ టన్నులు కావాలని నివేదికలు పంపించారు. ప్రభుత్వం నుంచి సూక్ష్మపోషకాలు మంజూరైతే రాయితీపై రైతులకు పంపిణీ చేస్తామని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.



ప్రభుత్వం అమలు చేస్తే పంపిణీకి సిద్ధం



సూక్ష్మపోషకాలపై రాయితీని ప్రభుత్వం అమలు చేస్తే రైతులకు పంపిణీ చేస్తాం. రైతులకు అవసరమైన సూక్ష్మపోషకాల వివరాలను ఉన్నతాధికారులకు అందజేశాం. ప్రభుత్వం సూక్ష్మపోషకాలను ఆర్బీకేలకు సరఫరా చేస్తే నిబంధనలకు అనుగుణంగా వాటిని పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటాం.
- సుధాకర్, వ్యవసాయాధికారి, శిరివెళ్ల



శ్రీశైలం జలాశయం జీవిత కాలాన్ని పెంచాలి

- సిద్ధేశ్వరం అలుగు నిర్మాణంతోనే ఇది సాధ్యం..
- రాయలసీమ సాగునీటి రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలి
- రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి
- నంద్యాలలో సాగునీటి ప్రాజెక్టుల సమస్యలపై సమావేశం

నంద్యాల టౌన్, సెప్టెంబరు 12 : రెండు తెలుగు రాష్ట్రాల నీటి అవసరాలకు శ్రీశైలం రిజర్వాయర్ అత్యంత కీలకమని, అది ఇప్పటికే చాలా పూడిపోయిందని, 50 లక్షల ఎకరాల సాగునీటి అవసరాలు తీర్చాలంటే శ్రీశైలం జలాశయం జీవితం కాలం పెంచాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. గురువారం నంద్యాలలో సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు - సమస్యలు - నీటి హక్కులపై సమావేశాన్ని నిర్వహించారు. రాయలసీమలోని 8 జిల్లాల నుంచి ప్రజాసంఘాల నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు, పలువురు ప్రముఖులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా బొజ్జా దశరథరామిరెడ్డి వివరిస్తూ.. శ్రీశైలం రిజర్వాయర్‌కు వరద ఇన్‌ఫ్లో ప్రారంభమై రెండు నెలలు అయిందని, పూర్తి స్థాయి నీటి సామర్థ్యంతో 50 రోజుల నుంచి ఉన్నప్పటికీ రాయలసీమలో ఉన్న రిజర్వాయర్లన్నీ వెల వెల బోతున్నాయని పేర్కొన్నారు. శ్రీశైలం నిండు కుండలా ఉన్నప్పుడు పోతిరెడ్డిపాడు నుంచి ప్రతి రోజు 4 టీఎంసీలు, తద్వారా 50 రోజుల్లో 200 టీఎంసీలు తీసుకొనే అవకాశం ఉండిందని అన్నారు. మల్యాల ఎత్తిపోతల ద్వారా 4 రోజులకు ఒక టీఎంసీ లాగా ఈ 50 రోజుల్లో 12 టీఎంసీలు తీసుకొని ఉండాలని అన్నారు. ఈ రెండు మార్గాల ద్వారా దాదాపు 210 టీఎంసీల నీరు పొందాల్సి ఉండగా రిజర్వాయర్ల నిర్వహణ లోపంతో, ప్రధాన కాల్వ లోపంతో కేవలం 85 టీఎంసీలను మాత్రమే రాయలసీమ జలాశయాల్లో నిల్వ చేశారని అన్నారు. ఏపీలో 42 శాతం భూభాగం రాయలసీమ ఉన్నప్పటికీ గత 10 ఏళ్ళుగా రాష్ట్ర బడ్జెట్‌లో సీమకు కేవలం 15 శాతం నిధులు కేటాయించడం వల్లనే రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు శిథిలావస్థకు చేరాయని అన్నారు.

సమగ్రమైన చర్చ జరగాలి :

కృష్ణా డెల్టాకు కేటాయించిన 101 టీఎంసీల నీటిని నాగార్జున సాగర్ - ప్రకాశం బ్యారేజ్ మధ్య తెలంగాణా నుంచి ప్రవహించే మూసీ, పాలేరు, మున్నేరు తదితర నదుల నుంచి పొందే హక్కును బచావత్ ట్రిబ్యూనల్ ఇచ్చిందని, అయితే ఈ నీటిలో కేవలం 20 టీఎంసీల నీటిని పొందే అవకాశం ఉందని, మిగిలిన నీటిని నాగార్జున సాగర్ ద్వారా లేదా శ్రీశైలం నుంచి పొందేలా 2015 జూన్ 18, 19వ తేదీల్లో జరిగిన కృష్ణానది యాజమాన్య బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ఇందులో అప్పటి ఏపీ ప్రభుత్వం క్రియాశీలంగా వ్యవహరించిందని అన్నారు. కృష్ణా డెల్టాకు కేటాయించిన నీటిని సముద్రంలోకి పారబోస్తూ ఇటు రాయలసీమ, అటు నాగార్జున సాగర్ వాడుకోవాల్సిన నీటిని డెల్టా తీసుకొనేలా అప్పటి సమావేశంలో తీర్మానం చేయడం దారుణమని అన్నారు. కృష్ణా డెల్టాకు నాగార్జున సాగర్ దిగువన లభించే కృష్ణా జలాలను వినియోగించుకోకపోతే పోలవరం నిర్మాణం జరిగినా రాయలసీమకు జరిగే మేలు ఏమీ ఉండదని ఆయన అన్నారు. ఈ విషయాలపై సమగ్రమైన చర్చ జరగాల్సిన అవసరం ఉందని బొజ్జా దశరథరామిరెడ్డి పేర్కొన్నారు.



మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి



సీఎం చంద్రబాబుకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, పక్కన మంత్రి టీజీ భరత్, తిక్కారెడ్డి తదితరులు

పత్తికొండ నుంచి రూ. 22 లక్షల విరాళం

- ముఖ్యమంత్రికి చెక్కును అందించిన ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ, సెప్టెంబరు 12: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సేకరించిన రూ. 22 లక్షలు బుధవారం ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ముఖ్యమంత్రి సహాయనిధికి అందించారు. మంత్రి టీజీ భరత్, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డితో కలిసి విజయవాడ సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించారు. దీంతోపాటు రూ.7.5 లక్షల విలువైన వెయ్యి నిత్యావసర వస్తువుల కిట్లను విజయవాడ భవానినగర్ ప్రాంతంలో ఇంటింటికి తిరిగి ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు నేరుగా అందించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, రాష్ట్ర నాయకులు నాగేశ్వరయాదవ్, సుబ్బరాయుడు, జ్ఞానేశ్వర్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కర్ణాటక జలచౌర్యాన్ని అడ్డుకోవాలి

- ఎస్ఈకి సీపీఎం వినతి



ఎస్ఈకి వినతి పత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 12: కర్ణాటక జల చౌర్యాన్ని అడ్డుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. గురువారం జలవనరుల శాఖ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ తుంగభద్ర జలాశయంలో నీటి వాటాను కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన నీటి హక్కును సక్రమంగా అమలు చేయకపోవడం వల్ల ఏపీలోని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, రైతుల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలో ముఖ్యంగా కరువుపీడిత ప్రాంతమైన రాయలసీమకు న్యాయం జరిపించేందుకు ఏపీ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. కర్ణాటక ప్రభుత్వం బచావత్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులకు వ్యతిరేకంగా తాజాగా తుంగభద్ర నదిపై రెండు చోట్ల బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మించాలని ప్రతిపాదనలు చేయడం తీవ్ర అన్యాయమని, వెంటనే ఈ ప్రతిపాదనను ఆ ప్రభుత్వం విరమించుకునేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే తుంగభద్ర నదిపై అక్రమంగా కర్ణాటక ప్రభుత్వం బ్యారేజీలు, ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేయడం వల్ల కర్నూలు జిల్లాలోని ఆయకట్టు రైతులకు సాగునీరు అందక పంటలు కోల్పోవాల్సి వస్తోందన్నారు. సుంకేసుల జలాశయం ఎగువన తుమ్మిళ్ల వద్ద తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన ఎత్తిపోతల పథకంతో పాటు ఆర్డీఎస్ వద్ద ఆ ప్రభుత్వం నీటి మళ్లింపునకు తీసుకుంటున్న చర్యల వల్ల కేసీ కెనాల్ ఆయకట్టుకు నీరు అందించలేని పరిస్థితి నెలకొంటుందని, ఈ అక్రమాలను వెంటనే ప్రతిఘటించేందుకు సీఎం చర్యలు చేపట్టాలని వినతి పత్రంలో కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, కేవీ నారాయణ తదితరులు ఉన్నారు.

ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతి



గిడ్డయ్య (ఫైల్)

ఆదోని, సెప్టెంబరు 12: ఆదోని పట్టణంలోని కల్లుబావి కాలనీకి చెందిన గిడ్డయ్య (55) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కల్లుబావి కాలనీకి చెందిన గిడ్డయ్య అనే వ్యక్తి గురువారం ఉదయం బహిర్భూమికి వెళ్లి ఇంటికి వెళుతుండగా ఆలూరు వైపు నుంచి వచ్చిన ట్యాంకర్ వెనకవైపు నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గిడ్డయ్య అక్కడికక్కడే మృతి చెదారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గిడ్డయ్యకు భార్య సరోజమ్మ, నలుగురు సంతానం ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి రిమాండ్

కోసిగి, సెప్టెంబరు 12: రెండు రోజుల క్రితం కోసిగి వైసీపీ నాయకురాలు, మాజీ జడ్పీటీసీ దలవాయి మంగమ్మను అదే పార్టీకి చెందిన నాయకుడు కురువ మల్లయ్య కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడని ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మల్లయ్యను గురువారం అరెస్టు చేసి హత్యాయత్నం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పత్తికొండ సబ్ జైలుకు తరలించినట్లు ఎస్ఐ చెప్పారు. ప్రస్తుతం మంగమ్మ ఆదోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

హాలహర్వి, సెప్టెంబరు 12: మండలంలోని చింతకుంట గ్రామంలో అర్జున్(16) అనే బాలుడు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఇంటి మిద్దెపై కలుపు మొక్కలను తొలగిస్తుండగా విద్యుత్ తీగ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్ర తెలిపారు.

కుందూలో ఇద్దరు గల్లంతు



గాలింపు చర్యలు చేపడుతున్న పోలీసు సిబ్బంది



రామసుబ్బారెడ్డి (ఫైల్)



బాలగురప్ప(ఫైల్)

కోవెలకుంట్ల, సెప్టెంబరు 12 : కోవెలకుంట్ల మండల పరిధిలోని కలుగొట్ల గ్రామానికి చెందిన బాలగురప్ప (44) అనే వ్యక్తి ఇటీవల మృతి చెందిన తన సమీప బంధువు కర్మకాండ నిర్వహించేందుకు గురువారం కుందూనది వద్దకు చేరుకున్నాడు. ఆ కార్యక్రమం అనంతరం స్నానం చేసేందుకు నదిలోకి దిగి నీటి ఉధృతికి కొట్టుకుపోయాడు. దీంతో బంధువులు ఒక్కసారిగా ఉలికిపాటుకు గురయ్యారు. పోలీసులకు సమాచారం ఇచ్చి గజ ఈతగాళ్లను రప్పించినా ఫలితం లేకపోయింది. మరో వైపు ఇదే గ్రామానికి చెందిన రామసుబ్బారెడ్డి (60) అనే వృద్ధుడు గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోవాలన్న ఉద్దేశంతో గురువారం కుందూలోకి దూకాడు. స్థానికులు రక్షించే యత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఒకే రోజు ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కుందూలో విగత జీవులు కావడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. రేవనూరు ఎస్ఐ భూపాలుడు పోలీసు సిబ్బంది, రెవెన్యూతో కలిసి గజ ఈతగాళ్ల సాయంతో కుందూలో గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు నాగార్జునరెడ్డి అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అయితే ఒకే రోజు ఇద్దరు గల్లంతు కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బ్యారేజీపై బోట్ల దాడిలో కుట్ర లేదా...?

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి



కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 12: ప్రకాశం బ్యారేజీని కూల్చేందుకు మాజీ సీఎం జగన్ కుట్ర చేసినట్లు...స్పష్టంగా ఆధారాలు కనిపిస్తున్నాయని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వరదల వల్ల విజయవాడ నగరం అతలాకుతలమై ఉంటే వైసీపీ బురద రాజకీయాలు చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 11 రోజులు పాటు రాత్రి, పగలు తేడా లేకుండా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ సౌకర్యాలను సమకూరుస్తుంటే జగన్ రెడ్డి బురద రాజకీయం చేయడం మంచి పద్ధతి కాదన్నారు. 80 టన్నుల పైగా బరువు ఉన్న మూడు బోట్లతో బ్యారేజీని ధ్వంసం చేయడం వైసీపీ కుట్ర కాదా? అని ప్రశ్నించారు. ఈ సంఘటనపై విచారణ వేగవంతం చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లాతో ఏచూరి

- 1975 ఎమర్జెన్సీలో కర్నూలులో సీతారాం



ఎస్టీబీసీ మైదానంలో ఎన్ఆర్‌సీ, సీఏఏ, ఎన్‌పీఆర్‌లకు వ్యతిరేకంగా జరిగిన సభలో మాట్లాడుతున్న సీతారాం ఏచూరి(ఫైల్)

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 12: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి గురువారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు కర్నూలు జిల్లాతో ప్రత్యేక అనుబంధం ఉంది. 1975 సంవత్సరంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధి విధించిన ఎమర్జెన్సీ సమయంలో కర్నూలు మెడికల్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ విద్యార్థులతో కలిసి సీతారాం ఏచూరి ఇక్కడే తలదాచుకున్నట్లు సమాచారం. 2004 ఎన్నికల్లో కర్నూలు ఎస్టీబీసీ కళాశాల మైదానంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. 2013 సుందరయ్య శతజయంతి ఉత్సవాల సందర్భంగా సుందరయ్య భవన్‌లో సుందరయ్య విగ్రహావిష్కరణలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ట్రస్టు ఏర్పాటుకు పునాది వేసింది ఏచూరినే. 2019 డిసెంబరులో ఎన్‌సీఆర్, ఎన్‌పీఆర్‌కి వ్యతిరేకంగా లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఉస్మానియా కళాశాలో మైదానంలో జరిగిన బహిరంగ సభలో ప్రత్యేక అతిథిగా హాజరై ప్రసంగించారు.

ఎరువుల కొరత సృష్టించొద్దు

- డీఏవో వైవీ మురళీకృష్ణ
- ఎరువుల దుకాణాల్లో విస్తృత తనిఖీలు
- రూ.23.55 లక్షల విలువ చేసే ఎరువుల సీజ్


నిల్వ ఉన్న ఎరువులను తనిఖీ చేస్తున్న డీఏవో మురళీకృష్ణ తదితరులు

నంద్యాల టౌన్, సెప్టెంబరు 12 : దుకాణాల్లో ఎరువుల కొరత సృష్టించొద్దని డీఏవో వైవీ మురళీకృష్ణ సూచించారు. గురువారం నంద్యాలలో పలు ఎరువుల దుకాణాలను డీఏవో ఆధ్వర్యంలో అధికారుల బృందం విస్తృత తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా మురళీ ఎంటర్ ప్రైజెస్, హర్షిత ఎంటర్ ప్రైజెస్ తది తర దుకాణాల్లో పలు పత్రాలు, రిజిస్టర్లు, బిల్ బుక్కు లతో పాటు ఎరువుల నిల్వలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌కు, ఎరువుల నిల్వలకు వ్యత్యాసం ఉండటంతో ఈ దుకాణాలకు సంబంధించి రూ.23.55 లక్షల విలువ చేసే ఎరువుల అమ్మకాలను నిలిపివేసినట్లు డీఏవో వైవీ మురళీకృష్ణ వెల్లడించారు. హోల్‌సేల్ దుకాణాలు, రీటైల్ దుకాణాల యజమానులు రైతుల కు ఎరువుల కొరత రాకుండా సక్రమంగా సరఫరా చేయాలని, రిజిస్టర్లకు, క్షేత్రస్థాయిలో నిల్వలు సమానంగా ఉండేటట్లు చూసుకోవాలని, లేని యెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులు కొన్న ప్రతి రైతుకు తప్పనిసరిగా దు కాణాల యజమానులు బిల్లులు ఇవ్వాలని, ఎంఆర్‌పీ ధరలకంటే అధిక ధరలకు విక్రయించినట్లు తెలిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో ఏడీఏ రాజశేఖర్, ఏవో ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పంట నమోదు చేయించుకోవాలి


తిమ్మాపురం అరటి తోటలో పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవనశాఖాధికారి నాగరాజు

మహానంది, సెప్టెంబరు 12: ప్రతి రైతు బాధ్యతగా పంట నమోదును చేయించుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నాగరాజు అన్నారు. గురువారం మహానంది మండలం తిమ్మాపురం, బుక్కాపురం, పుట్టుపల్లి పొలాల్లోని అరటి తోటల్లో సిబ్బంది రైతులతో చేస్తున్న పంట నమోదు ప్రక్రియను జిల్లా ఉద్యానవన శాఖ అధికారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరటిపంటను వాతావరణ ఆధారిత బీమా పంటగా నంద్యాల జిల్లాలో మండల యూనిట్ పంటగా తెలియజేశారు. పంట రుణాలు, పంట నష్టం, మార్కెటింగ్ పొందాలంటే తప్పనిసరిగా పంట నమోదును సిబ్బంది ద్వారా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖాధికారి శ్రీధర్, ఉద్యానవన సహాయ సంచాల కులు మౌనిక, వసుంధర, రాజేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు


2వ వార్డు సచివాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న కమిషనర్

నందికొట్కూరు, సెప్టెంబరు 12: విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని నందికొట్కూరు మునిసిపల్ కమిషనర్ బేబీ వార్డు సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. గురువారం నందికొట్కూరు పట్టణంలోని వార్డు సచివాలయాలను కమిషనర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పట్టణంలోని 14 సచివాలయాల్లోని రికార్డులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సచివాలయానికి వచ్చిన ప్రతి వ్యక్తిని గౌరవించి సమస్యను పరిష్కరించాలని సూచించారు.

కామేశ్వరీదేవికి పట్టు చీరల వితరణ


మహానందిలో ఏఈవో మధుకు పట్టువస్త్రాలు అందిస్తున్న దాతలు

మహానంది, సెప్టెంబరు 12: మహానంది క్షేత్రంలో వచ్చేనెల 3నుంచి జరిగే దసరా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలకు పది పట్టు చీరలను సికింద్రాబాద్‌కు చెందిన వారణాశి రామ్మోహన్‌రావు, విజయలక్ష్మి దంపతులు విరాళంగా ఇచ్చినట్లు ఆలయ వేదపండితులు చండూరి రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ తెలిపారు. గురువారం దాతలు ఆలయ ప్రాంగణంలోని కల్యాణమంటపంలో పట్టుచీరలను ఆలయ ఏఈవో ఎర్రమల్ల మధుకు అందజేశారు. 20 సంవత్సరాలుగా దాతలు పట్టువస్త్రాలను అందజేస్తున్నట్లు పండితులు చెప్పారు. అనంతరం దాతలను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాచమల్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల క్షేమం కోసమే పౌష్టికాహారం

- మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి - గర్భిణులకు సీమంతాలు


గర్భిణులకు సీమంతం చేస్తున్న మునిసిపల్ కమిషనర్

నందికొట్కూరు, సెప్టెంబరు 12: తల్లీబిడ్డలు క్షేమంగా ఉండేందుకే ప్రభుత్వాలు పౌష్టికాహారాన్ని అందిస్తున్నాయని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం నందికొట్కూరు పట్టణంలో మెప్మా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జై కిసాన్ పార్కులో పౌష్టికాహార మాసోత్సవాలు ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమిషనర్ బేబి, సీడీపీవో కోటేశ్వరమ్మ పాల్గొన్నారు. పౌష్టికాహారంపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు. మెప్మా టీఎంసీ శాంతకుమారి, కౌన్సిలర్లు అబ్దుల్ రావూఫ్, లాలు ప్రసాద్, వీఆర్ శ్రీను, ఆర్పీలు, ఓబీలు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాములపాడు మండల కేంద్రంలో..

పాములపాడు: కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లలిత సూచించారు. గురువారం మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలు, ఆకుకూరలు ప్రదర్శించి వాటి వల్ల ప్రయోజనాలను ఆమె వివరించారు. కార్యక్ర మంలో అంగన్‌వాడీ టీచర్లు శివలక్ష్మి, నాగమ్మ, నాగమణి, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా మండల కేంద్రంలో..

జూపాడుబంగ్లా: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేస్తున్న పౌష్టికాహారాలను గర్భిణులు తప్పనిసరిగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పావని అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కాసానగర్‌లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీదేవి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

వీధి కుక్కల నుంచి కాపాడండి: సీపీఎం

నందికొట్కూరు, సెప్టెంబరు 12: వీధి కుక్కల నుంచి పిల్లలు, పెద్దలకు రక్షణ కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగేశ్వరరావు కోరారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన కాలనీవాసులతో కలిసి కమిషనర్ బేబీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పట్టణంలోని శాంతి టాకీస్, ట్యాంక్ ఏరియా, ఎస్.ఎస్.ఆర్. నగర్, హాజీనగర్, శాయిబాబపేట, సంగయ్యపేట, అల్లూరు రోడ్డు, ఏబీఎం పాలెం తదితర కాలనీల్లో వీధి కుక్కలు గుంపులుగా చేరడం తో ప్రజలు రోడ్డుపైకి వెళ్లేందుకు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. మునిసిపల్ అధికారులు కుక్కలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. నాయకులు గోపాల కృష్ణ, కాలనీ వాసులు అబ్దుల్ రషీద్, షేక్ ఫరీద్, దూదేకుల బాబు, రమేష్, రవి, ఉన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ఈ-మెయిల్స్


ఈ-మెయిల్ శిబిరంలో పాల్గొన్న ముస్లిం జేఏసీ నాయకులు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 12: వక్ఫ్ బిల్లు సవరణను వ్యతిరేకిస్తూ నంద్యాల ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక గాంధీచౌక్‌లో ఈ-మెయిల్ శిబిరాన్ని నిర్వహించారు. ముస్లిం జేఏసీ గౌరవాధ్యక్షులు అబులైస్, అబ్దుల్ సమ్మద్ మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుతో రాజ్యాంగం మైనార్టీలకు కల్పించిన హక్కులను కాలరాయడమేనని అన్నారు. బిల్లు పాసైతే ముస్లిమేతరులు వక్ఫ్ ఆస్తులపై పెత్తనం చలాయిస్తారని వక్ఫ్‌బోర్డుకున్న అధికారాలను ప్రభుత్వం లాక్కుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఉన్న వక్ఫ్ ట్రిబ్యునల్ తన అస్తిత్వాన్ని కోల్పోనుందని, ప్రతి ముస్లిం సోదరులు, అభ్యుదయవాదులు, లౌకికవాదులు ఈ బిల్లుకు వ్యతిరేకంగా, జాయింట్ పార్లమెంటరీ కమిటీకి శుక్రవారంలోపు అభ్యంతరాలను తెలపాలని పిలుపునిచ్చారు. శిబిరంలో దాదాపు వెయ్యికిపైగా మెయిల్స్‌ను పంపినట్లు చెప్పారు. కార్యక్రమంలో ముస్లిం జేఏసీ కన్వీనర్ మౌలానా అబ్దుల్లా రాషాది, స్వర్ణకారుల సంఘం, విజిటబుల్ మార్కెట్ సంఘం నాయకులు, వివిధ ముస్లిం అనుబంధ సంస్థల నాయకులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డులో రాజకీయ జోక్యం తగదు

వెలుగోడు: ముస్లిం మైనార్టీలకు చెందిన వక్ఫ్‌బోర్డులో రాజకీయ జోక్యం తగదని పలు పార్టీల నాయకులు అన్నారు. గురువారం వెలుగోడు పట్టణంలో ఎస్‌బీటీఏ ఆధ్వర్యంలో వక్ఫ్‌బోర్డు సవరణకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఆరీఫ్‌హుస్సేన్, సయ్యద్, హుస్సేన్‌బాషా, ఇంతియాజ్, ఇలియాస్, సయ్యద్‌మౌలానా, మహమ్మద్‌రఫీ, నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి మృతి పార్టీకి తీరని లోటు


సీపీఎం కార్యాలయం వద్ద పార్టీ జెండా అవనతం చేస్తున్న నాయకులు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 12: జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాం మృతి మార్క్సిస్ట్ పార్టీకి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ అన్నారు. సీతారాం మృతి పట్ల గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో సీపీఎం జెండా అవతనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన మాట్లాడుతూ 72 సంవత్సరాల సీతారాం తన జీవితాన్ని కమ్యూనిస్టు ఉద్యమానికి ధారపోశారన్నారు. ఆయన మృతి ప్రపంచ, భారత కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటన్నారు. ప్రపంచ కమ్యూనిస్టు నాయకుల్లో ఒకరిగా మన్ననలు పొందాడన్నారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు యేసురత్నం, తోటమద్దులు, శ్రీనివాసమూర్తి, రామరాజు, శంకరయ్య, బాలవెంకట్, వీరసేన, నాయక్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీపీఐ సంతాపం

జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాం మృతి పట్ల సీపీఐ జిల్లా సమితి నాయకులు రంగనాయుడు, బాబాఫక్రుద్దిన్ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి జాతీయస్థాయికి ఎదిగిన ఏచూరి నేటి యువతకు ఆదర్శప్రాయుడని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- వంద పడకల ఆసుపత్రిగా మార్చేందుకు కృషి చేస్తా
- శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి


ఆస్పత్రిలో బాలింతతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా

ఆత్మకూరు, సెప్టెంబరు 12: ఆత్మకూరు సామాజిక వైద్య కేంద్రానికి వచ్చే రోగుల కు మెరుగైన వైద్యసేవలు అందించాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పా ల్గొని మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న 30 పడకల ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. అదేవిధంగా వైద్యుల కొరత లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ఆసుపత్రిలో ఆర్వోప్లాంట్, సీసీ కెమెరాల ఏర్పాటుకు చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. రాత్రివేళల్లో ఆసుపత్రి పరిధిలో పోలీసు గస్తీ ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. అలాగే ఆసుపత్రిలో రోగుల కు అవసరమయ్యే అన్ని సదుపాయాలు కల్పిస్తామని వివరించారు. అనంతరం ఆయన ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. అంతకుముందు ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్యే బుడ్డాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రాయుడు, ఎంపీడీ వో మోహన్‌కుమార్, మున్సిపల్ మేనేజర్ వెంకటేశ్వరగౌడ్, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా తదితరులు ఉన్నారు.

అమరుల పోరాటం స్ఫూర్తిదాయకం

ఆత్మకూరు, సెప్టెంబరు 12: అమరుల పోరాటం స్ఫూర్తిదాయకమని ఏపీ రజక సంఘం వృత్తిదారుల సంఘం నాయకులు వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, శ్రీరాములు తెలిపారు. గురువారం చాకలి ఐలమ్మ, విద్యుత్ పోరాటంలో అమరులైన సత్తెనపల్లి రామకృష్ణ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదల భూములను లాక్కోవడానికి ప్రయత్నించిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపించిన వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. నాయకులు వెంకటస్వామి, నారాయణ, రామకృష్ణ, సుంకన్న, శ్రీనివాసులు, రణధీర్, తదితరులున్నారు.

జీవో నెంబరు 85ను రద్దు చేయాలి

మిడుతూరు, సెప్టెంబరు 12: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జీవో నెంబరు 85ను రద్దు చేయాలని కడుమూరు పీహెచ్‌సీ డాక్టర్ రాజు కోరారు. గురువారం నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. శుక్రవారం నుంచి జూమ్ మీటింగులకు, ఆన్‌లైన్ రిపోర్టులకు డాక్టర్లు దూరంగా ఉంటున్నట్లు డాక్టర్ రాజు అన్నారు.

సీఎం సహాయ నిధికి విరాళం


మంత్రి ఫరూక్‌కు చెక్కును అందజేస్తున్న కొండారెడ్డి

నంద్యాల రూరల్, సెప్టెంబరు12: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు సీఎం సహాయనిధికి విరాళాలు అందజేస్తున్నారు. గురువారం నంద్యాల టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌కు ఎస్‌డీఆర్ పాఠశాల అధినేత కొండారెడ్డి రూ. లక్ష, కరుణామయ పాఠశాల విద్యాసంస్థల చైర్మన్ దండే దస్తగిరి రూ. 30వేలు ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా దాతలను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రరావు, రాష్ట్ర యువనాయకుడు ఎన్‌ఎండీ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశ్వనాథ్ మాదిగ, ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బాయికాటి బెనర్జీ మాదిగ, ఎంఈఎఫ్ జాతీయ నాయకుడు బుచ్చర్ల నరసింహులు తదితరులు గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సుప్రీం కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్రంలో వర్గీకరణను అమలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి ఫరూక్‌ను కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

మహానందిలో..

మహానంది: వరద బాధితుల సహాయార్థం మహానందిలో టీడీపీ నాయకులు విరాళాలు సేకరించారు. టీడీపీ గ్రామ నాయకుడు నూరే శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురువారం క్షేత్ర పరిధిలోని వ్యాపార సముదాయాలతో పాటు ఇంటింటా తిరిగి కా ర్యకర్తలు విరాళాలు సేకరించారు. వీటిని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ద్వారా విజయవాడ వరద బాధితులకు అందజేస్తామని నాయకులు తెలిపారు.

ఆత్మకూరు టీడీపీ కార్యాలయంలో..

ఆత్మకూరు: విజయవాడ వరద బాధితులను ఆదుకోవాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఇచ్చిన పిలుపునకు నియోజకవర్గంలో విశేషమైన స్పందన లభిస్తోంది. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల యజమాన్యం, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి, మెడికల్ దుకాణాల అసోసియేషన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, కిరాణం మర్చంట్ అసోషియేషన్, ఆర్యవైశ్య సంఘం తదితర యూనియన్లతో పాటు సీనియర్ అడ్వకేట్ మాధవరెడ్డి, ఆయా గ్రామాలు, వార్డులకు సంబంధించి భారీ మొత్తంలో విరాళాలను అందజేశారు.

వెలుగోడు టీడీపీ కార్యాలయంలో..

వెలుగోడు: వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పిలుపు మేరకు విరాళా లు అందిస్తున్నారు. గురువారం వెలుగోడు టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేకు ఆర్‌ఆర్ గ్రూపు అధినేత రాఘవరెడ్డి రూ. లక్ష చెక్కును అందించారు.

చేపలు పడితే కఠిన చర్యలు: ఎస్‌ఐ

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 12: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ డేంజర్‌జోన్ వద్ద చేపలు పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ లక్ష్మీనారాయణ మత్స్యకారులను హెచ్చరించారు. నిషేధిత ప్రాంతంలో చేపలు పట్టడమేకాకుండా శాంతిభద్రతలకు విఘాతం కలిస్తున్నారని మత్స్యకారులను పోలీసుస్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇకపై పోతిరెడ్డిపాడు వద్ద చేపలు పడితే మత్స్యశాఖ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పోలీసులను పంపించి పోతిరెడ్డిపాడు వద్ద కట్టిన జాలర్లను తొలగించారు.

టీడీపీ కార్యకర్త మృతి

పాణ్యం, సెప్టెంబరు 12: స్థానిక తెలుగుపేటకు చెం దిన టీడీపీ కార్యకర్త యేదు సురేష్ (27) గుండె జబ్బుతో మృతి చెందినట్లు టీడీపీ రాష్ట్ర లీగల్‌సెల్ కార్యదర్శి రాం మోహన్‌నాయుడు తెలిపారు. గురువారం సురేష్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సురేష్ పెం యింటర్‌గా జీవనం చేసుకుంటుండేవాడని మృతితో భార్య శివమల్లేశ్వరి, నలుగురు ఆడపిల్లలు అండ కోల్పోయారన్నారు. సురేష్ కుటుంబాన్ని ఆదుకుంటుందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఉపసర్పంచ్ చంద్రశేఖరరెడ్డి సురేష్ కుటుంబ సభ్యులకు రూ. 10 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రంగరమేష్, ముస్లిం మైనార్టీనాయకులు ఖాదర్‌బాష, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు గుర్రం బాలన్న, గుజ్జుల సుబ్బయ్య, మహేష్, పెయింటర్లు పాల్గొన్నారు.

ఇద్దరికి రిమాండ్

నంద్యాల క్రైం, సెప్టెంబరు 12: ఇద్దరు వ్యక్తులకు మేజిస్ట్రేట్ కోర్టు జైలు, జరిమానా విధించినట్లు పోలీసులు గురువారం తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆత్మకూరు బస్టాప్ వద్ద బుధవారం మద్యం తాగి పాదచారుల పట్ల అమర్యాదగా ప్రవర్తించిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి ఐదు రోజుల జైలు శిక్ష, రూ.వెయ్యిచొప్పున జరిమానా విధించారు. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపినా, మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించినా, అధికారులతో అమర్యాదగా ప్రవర్తించినా కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 12: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన ఆత్మకూరు పట్టణ శివార్లలోని ఉర్దూ స్కూల్ వద్ద ఆత్మ కూరు నంద్యాల రహదారిలో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని బాపనంతాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తి పని నిమిత్తం ఆత్మకూరు పట్టణానికి గ్రామం నుంచి సాయంత్రం బైక్‌పై బయలుదేరాడు. కాగా బాపనంతాపురం ఆత్మకూరు మధ్యలో ఉన్న ఉర్దూ స్కూల్ సమీపంలోకి రాగానే ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లియింది. దీంతో శ్రీనివాసులుకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించి, క్షతగాత్రున్ని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

గడివేముల, సెప్టెంబరు 12: మండలంలోని గడిగరేవుల గ్రామానికి చెందిన రామచంద్రుడు, బసవ రాజు, జయలక్ష్మిలపై రుద్రవరం మండలం చిన్నకంబలూరు గ్రామానికి చెందిన నాగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గడిగరేవుల గ్రామానికి చెందిన రామచంద్రుడు, జయక్ష్మిల కొడుకు బసవరాజుకు రుద్రవరం మండలం చిన్నకంబలూరు గ్రామానికి చెందిన నాగేష్ సోదరి రమాదేవిని ఇచ్చి 14 సంవత్సరాల క్రితం వివాహం చేశారు. వీరికి హరిప్రియ సంతానం. అయితే కొద్ది రోజులుగా కొడుకు పుట్టలేదని రమాదేవిని భర్త బసవరాజు, అత్త జయలక్ష్మి, మామ రామచంద్రుడు మానసికంగా శారీరకంగా వేధించేవారని అన్నారు. బసవరాజు బుధవారం రమాదేవిపై రోకలి బడ్డతో దాడి చేసి గాయపరిచాడు. అడ్డుకోబోయిన కూతురు హరిప్రియ కూడా గాయాలపాలైనట్లు తెలిపారు. బాధితురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు, సెప్టెంబరు 12: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు వేతన సవరణ కమిషన్ ను ఏర్పాటు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు కమతం శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా సహాధ్యక్షుడు ఉమర్ కోరారు. గురువారం ఆత్మకూరు పట్టణంలో నిర్వహించిన ఆ సంఘం డివిజన్ స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయు లపై యాప్‌ల, ఆన్‌లైన్ పనిభారాలను తగ్గించాలని అన్నా రు. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమా వేశంలో ఆ సంఘం నాయకులు దాసు, అబ్దుల్‌వహీద్, జక్కం దాసు, కృష్ణుడు, రామాంజనేయులు, ఆఫీఫ్‌బాషా, విధుభూషణ్, రాజ్‌కుమార్, రవికుమార్ ఉన్నారు.

పోలీసుల సహకారం మరువలేనివి

ఆత్మకూరు, సెప్టెంబరు 12: ఆత్మకూరు ప్రాంతంలో గణేశ్ నిమజ్జన క్రతువులో పోలీసుల సహకారం మరువ లేనిదని వినాయక ఉత్సవ సమితి అధ్యక్షుడు గరుడాద్రి సత్యనారాయణ, విశ్వహిందూ పరిషత్ నాయకులు గరు డాద్రి సుదర్శన్, శ్రీధర్‌గుప్తాలు పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలో జరిగిన వినాయక నిమజ్జనం ప్రశాంతంగా ముగియడంతో గురువారం డీఎస్పీ రామాంజి నాయక్, అర్బన్, రూరల్ సీఐలు ఓబులేసు, సురేష్ కుమార్‌రెడ్డితో పాటు దాతలను వినా యక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సత్కరించారు. వినా యక ఉత్సవ సమితి ప్రతినిధులు మాయలూరి రమణ, వంగాల భాస్కర రెడ్డి, మారం భానుమూర్తి, రాసంశెట్టి చంద్రశేఖర్, శేగు కిరణ్‌కుమార్, ఆవులరెడ్డి ఉన్నారు.

దిమ్మె నిర్మించారు

బండిఆత్మకూరు, సెప్టెంబరు 12: నంద్యాల - ఆత్మకూరు ప్రధాన రహదారిలోని సంతజూటూరు సొసైటీ వద్ద విద్యుత్ అధికారులు దిమ్మె నిర్మించారు. నాలుగు రోజుల క్రితం సింగల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌లో చెలరేగిన మంటలు, తప్పిన ప్రమాదం అన్న కథనం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన విషయం విధి తమే. ఈ మేరకు స్పందించిన విద్యుత్, పంచా యతీ అధికారులు ఎర్త్, ఫేస్‌లు కలువకుండా ఉండే విధంగా దిమ్మెను నిర్మించారు. గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అర్ధరాత్రి ఎస్పీ పర్యటన

నంద్యాల క్రైం, సెప్టెంబరు 12: గణేశ్ నిమజ్జనం సందర్భంగా పట్టణంలోని చిన్న చెరువు కట్ట వద్ద ఏర్పాటు చేసిన వినాయకఘాట్‌ను, పరిసర ప్రాంతాలను బుధవారం అర్ధరాత్రి ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పరిశీలించారు. ముందుగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి వినాయక విగ్రహాల శోభాయాత్రను పర్యవేక్షించారు. ఎస్పీ వెంట ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, స్పెషల్ బ్రాంచ్ సీఐ ఏరిషావలి, నంద్యాల ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్త, తాలుకా సీఐ, ఇతర అధికారులు ఉన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

టీడీపీ నాయకుడికి పరామర్శ


అన్వర్‌ను పరామర్శిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, సెప్టెంబరు 12: గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న బనగానపల్లె పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ మైనార్టీ నాయకుడు అన్వర్‌సాహెబ్‌ను మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి గురువారం పరామర్శించారు. అన్వర్‌సాహెబ్ ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై గుండెకు శస్త్రచికిత్స చేయించుకొని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలిసిన బీసీ రాజారెడ్డి అన్వర్‌సాహెబ్‌ను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

భగత్‌సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి


ఎమ్మెల్యే కోట్లకు వినతి పత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

డోన్(రూరల్), సెప్టెంబరు 12: స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ భగత్ సింగ్ విగ్రహాన్ని డోన్ పట్టణంలో ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్య ప్రతాప్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రణత్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్ర కాష్ రెడ్డిని వారు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోన్ పట్టణంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కోరారు.

పోలీసుల కృషి అభినందనీయం

డోన్(రూరల్), సెప్టెంబరు 12: డోన్ నియోజకవర్గంలో గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించడానికి పోలీసుల కృషి అభినందనీయమని వెంకటనాయునిపల్లె గ్రామ సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు అన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ డోన్ డీఎస్పీ పి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో గణేశ్ ఉత్సవాలు 9 ఏళ్ల తర్వాత ఐదు రోజుల అనుమతి ఇచ్చారన్నారు. ప్రజల ప్రశాంతతకు ఎటువంటి భంగం కలగకుండా పోలీసు అధికారులు తీసుకున్న చర్యలు ప్రశంసనీయమన్నారు.

ముగిసిన వినాయక నిమజ్జనం

కోవెలకుంట్ల, సెప్టెంబరు 12: కోవెలకుంట్ల పట్టణంలో వినాయక నిమ జ్జనం ఘనంగా ముగిసిందని గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామక్రిష్ణారెడ్డి అన్నారు. గురువారం కోవెలకుంట్ల పట్టణం లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది వినాయక చవితి పం డుగ సందర్భంగా నిర్వహించే ఉత్సవాల కమిటీకి అధ్యక్షుడిగా గడ్డం రామక్రిష్ణరెడ్డిని సభ్యులు ఎన్నుకున్నారన్నారు. ఉత్సవాలకు సహకరించిన అధికారులు, పోలీసులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

కోవెలకుంట్ల, సెప్టెంబరు 12: కోవెలకుంట్ల పట్టణానికి చెందిన విక్కీ ఫౌండేషన్ సభ్యుడు గోపిరెడ్డి ఆధ్వర్యంలో విజయవాడ వెళ్లి వరద ముం పునకు గురై సర్వం కోల్పోయిన లక్ష్మి అనే మహిళకు రూ.5వేలు, అలాగే బాంబే కాలనీలో ఉన్న వృద్ధాశ్రమం జలమయం కావడంతో వారికి నిత్యా వసర సరుకులు పంపిణీ చేశారు. అలాగే మాతృదేవోభవ వృద్ధాశ్రమానికి రూ.5వేలు నిత్యావసన సరుకులు పంపిణీ చేశామని గోపిరెడ్డి తెలిపారు.

చెకుముకి పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలి


పోస్టర్లను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

ప్యాపిలి, సెప్టెంబరు 12: చెకుముకి పోటీల్లో ప్రతి విద్యార్థి పాల్గొనాలని మండల విద్యాధికారి వెంకటేశ్వరనాయక్ అన్నారు. ఈనెల 25 నుంచి ప్రాంభమయ్యే చెకుముకి పోటీలకు సంబంధించిన పోస్టర్లను గురువారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లతీఫ్, వెంకటేశ్వర్లు, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 12: సీపీఎం జాతీయ నాయకుడు సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటని డివిజన్ నాయకులు దావీదు అన్నా రు. గురువారం కొలిమిగుండ్లలో ఆయన మాట్లాడుతూ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం మృతి చెందారని, వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని అన్నారు.

పశు బీమాను సద్వినియోగం చేసుకోండి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 12: గ్రామాల్లోని పాడి రైతులు పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి డాక్టర్ పద్మావతి సూచించారు. గురువారం ఆమె మాట్లాడుతూ పశువుల యజమానులు పశు బీమా తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు.

సొంత నిధులతో సీసీ రోడ్డు


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకుడు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 12: మండలంలోని చింతలాయపల్లె గ్రామం లో విద్యార్థి బస్సు రాకపోకలకు కలిగిన ఇబ్బందులను టీడీపీ సీనియర్ నేత అంబటి జయలక్ష్మీరెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. ఇరుకుగా ఉన్న రహదారిని సొంత నిధులతో సీసీ రోడ్డు నిర్మించి, వెడల్పు చేశారు. దీంతో విద్యార్థి బస్సు రాకపోకలకు అడ్డంకి తొలగిపోయింది. కార్యక్రమంలో టీడీపీ యువ నేత అంబటి వివేకానందరెడ్డి, చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

చీని, నిమ్మతోటల పరిశీలన

చాగలమర్రి, సెప్టెంబరు 12: మండలంలోని శెట్టివీడు, చింతలచెరువు, కొలుములపేట గ్రామాలలో రైతులు సాగు చేసిన చీని, నిమ్మతోటలను ఆళ్లగడ్డ డివిజన్ ఇన్‌చార్జి ఉద్యానశాఖ అధికారి సురేష్ గురువారం పరిశీలించారు. 50 ఎకరాల్లో చీనీ నిమ్మ తోటలు రైతులు సాగు చేశారని ఆయన పేర్కొన్నారు. సూక్ష్మ పోషకాల లోపాలు, వేరు కుళ్లు తెగుళ్ల గురించి రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చామని అన్నారు. మార్కెట్ ధరల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వీహెచ్ఏలు ఉమామహేశ్వరి, దేవేంద్ర, రైతులు ఉన్నారు.

టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణ

ఐదుగురికి గాయాలు - ఇరువర్గాలపై కేసు నమోదు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 12: మండలంలోని చింతలాయపల్లె గ్రామంలో గురువారం రాత్రి టీడీపీ- వైసీపీ వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇరు వర్గాల వారు కేకలు వేస్తూ దాడులకు పాల్పడటంతో గ్రామంలో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయని, వీరిపై కేసు నమోదు చేశామని సీఐ రమేష్‌బాబు వెల్లడించారు. వైసీపీకి చెందిన వల్లపు ప్రసాద్, ప్రకాశ్, పెద్దిరాజు, సావిత్రి, టీడీపీకి చెందిన వడ్డె మాకర్ల శ్రీనివాసులుకు గాయాలయ్యాయి. గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని సీఐ రమేష్‌బాబు హెచ్చరించారు.

వాగు కష్టాలు

- వరద వస్తే రాకపోకలకు ప్రమాదమే
- వంతెన నిర్మాణానికి రైతుల ఎదురు చూపు


చాగలమర్రిలో అడ్డవాగు నుంచి సాగు భూములకు వెళ్తున్న రైతులు, కూలీలు

చాగలమర్రి, సెప్టెంబరు 12: చాగలమర్రి గ్రామ సమీపంలోని గోపాయపల్లె రహదారి వద్దగల అడ్డవాగు వరద నీటిలో దాటేందుకు రైతులు, కూలీలు అవస్థలు పడుతున్నారు. వాగు సమీపంలో రెండు వేల ఎకరాల్లో కంది, మినుము, మల్లె, జొన్న తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ పంట పొలాలను నమ్ముకొని సుమారు 500 మంది రైతులు, కూలీలు జీవనం సాగిస్తున్నారు. వర్షపు నీరు, టీజీపీ లీకేజీ నీరు కలిసి అడ్డవాగుకు చేరడంతో రైతులు వాగు దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పంట పొలాలకు వెళ్లలేక, పంటలను కాపాడుకోలేక రైతులు నష్టపోతున్నారు. పండించిన పంటలు ఇంటికి తీసుకొని రావాలన్న ఇబ్బందులు తప్పడం లేదు. అడ్డవాగుపై వంతెన నిర్మించక పోవడంతో 15 ఏళ్ల నుంచి రైతులు అవస్థలు పడుతున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిలప్రియ అడ్డవాగుపై వంతెన నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఆమె హామీ మేరకు పంచాయతీరాజ్ ఏఈ కొండారెడ్డి రూ. 20 లక్షలతో వంతెన నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించారు. అయితే పనులకు నోచుకోలేదు. ప్రతి ఏడాది వర్షాకాలంలో వాగు దాటేందుకు రైతులు, కూలీలు నరకయాతన పడుతున్నారు. పంట దిగుబడి తరలించేందుకు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొద్దిపాటి వరద వచ్చిన వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రైతులు సాగు భూములకు వెళ్లలేని పరిస్థితి దాపురించింది. వరద తగ్గే వరకు ఈ ప్రాంతంలో రాకపోకలు సాగించలేకపోతున్నారు. ఆళ్లగడ్డకు మళ్లీ భూమా అఖిలప్రియ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో వంతెన నిర్మాణ పనులు చేపడతారని రైతులు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని వాగుపై వంతెన నిర్మాణం చేపట్టి తమను ఆదుకోవాలని రైతులు, కూలీలు కోరుతున్నారు.

తాగునీరు కలుషితం వల్లే అతిసార వ్యాధి


ప్రజలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 12: ఆళ్లగడ్డ పట్టణంలోని చాంద్‌వీధిలో తాగునీరు కలుషితం వల్లే అతిసార వ్యాధి సోకిందని డీఎంహెచ్‌వో వెంకటరమణ అన్నారు. వైద్యసిబ్బందితో కలిసి ఆయన సచివాలయ పరిధిలోని పరిసరాలను పరిశీలించారు. వీధిలోని తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందన్నారు. వీధిలో అతిసార వ్యాధిగ్రస్తులు పెరగడంతో ఆయన వైద్యులతో సమీక్ష నిర్వహించారు. రెండు సార్లు విరేచనాలు అయితే వెంటనే ఆశా, ఏఎన్ఎంలను కలిసి వైద్యం చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రజలు మంచినీటిని వేడి చేసుకొని, చల్లారిన తరువాత తాగాలని, వేడివేడి పదార్థాలు తినాలని ఆయన సూచించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో జగదీష్ చంద్రారెడ్డి, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు నరసింహ, సూపర్‌వైజర్ దస్తగిరిరెడి పాల్గొన్నారు.

బాలికల పాఠశాల తనిఖీ

చాగలమర్రి, సెప్టెంబరు 12: చాగలమర్రి గ్రామంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను ఎంఈవో న్యామతుల్ల గురువారం తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల గ్రేడింగ్‌ను పరిశీలించారు. విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యతగల భోజనం ఇవ్వాలని, మెనూ పాటించాలని ఏజెన్సీలకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

చాగలమర్రి, సెప్టెంబరు 12: మండలంలోని చిన్నబోదనం, పెద్దబోదనం గ్రామాల్లో మూడు నెలలుగా సాగు చేసిన మొక్కజొన్న పంటకు గింజలు రావడం లేదని బాధిత రైతులు వ్యవసాయాధికారి రంగనేతాజీకి తెలియజేశారు. గురువారం ఏవో మొక్కజొన్న పంట పొలాలను పరిశీలించారు. ఏవో మాట్లాడుతూ 90 రోజుల విరాట్‌జిల్ రకం మొక్కజొన్న కంకుల్లో 25 నుంచి 50 శాతం మాత్రమే విత్తనాలు ఉన్నట్లు గమనించామని అన్నారు. రైతులతో చర్చించి ప్రాథమిక నివేదిక తయారు చేసి వాస్తవాలు తెలుసుకునేందుకు శాస్త్రవేత్తలకు ప్రతిపాదనలు చేస్తామని ఏవో పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీ లోపు రైతులు పంట నమోదు, ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

బేతంచెర్ల, సెప్టెంబరు 12: అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసు రత్నం, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షుడు షేబారాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఏడో అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు వై.ఎల్లయ్య, అంగన్‌వాడీలు సంతోషమ్మ, రమణమ్మ, అనూష, నారాయణమ్మ, కరిష్మా పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు సర్వే వేగవంతం

చాగలమర్రి, సెప్టెంబరు 12: గ్రామాల్లో ఓటర్ల నమోదు, సవరణ సర్వే కార్యక్రమాన్ని బీఎల్‌వోలు వేగవంతం చేయాలని ఇన్‌చార్జి తహసీల్దార్ చంద్రశేఖరయ్య తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారం-6, 8 దరఖాస్తులను పరిశీలించారని అన్నారు. రెండు ఓట్లు ఉన్న వారిని గుర్తించి ఒక్కటి మాత్రమే ఉండేలా చూడాలని అన్నారు. ఓటర్ల సర్వే కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని తెలియజేశారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 12: ఆళ్లగడ్డ పట్టణంలోని పొదుపు మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దస్తగిరమ్మ తెలిపారు. గురువారం ఆళ్లగడ్డ పట్టణంలోని మౌలా వీధిలో పొదుపు మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలను చేయరాదని వివరించారు. కార్యక్రమంలో పొదుపు మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

12గంటలకే వైద్యుల కుర్చీ ఖాళీ


ఖాళీగా ఉన్న వైద్యుడి కుర్చీ

రుద్రవరం, సెప్టెంబరు 12 : మండలంలోని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మధ్యాహ్నం 12గంటలకే ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఓ వైపు వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు సీజనల్ వ్యాధులతో సతమతమవుతున్నారు. వైద్యులు అలా వచ్చి ఇలా వెళితే వైద్యం అందించేది ఎవరన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒక వైద్యాధికారి ఆరోగ్య శిబిరాలకు వెళ్తే మరో వైద్యాధికారి తప్పనిసరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉండాలని ప్రభుత్వ వైద్య ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయి. కానీ ఇక్కడ పని చేసే వైద్యులు వాటిని పట్టించుకోవడం లేదు. వచ్చిన రోగులు వైద్యసిబ్బంది ఇచ్చిన మందులను తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై వైద్యాధికారి బాబు మాట్లాడుతూ ఆళ్లగడ్డ మండలం చింతకొమ్మదిన్నె పాఠశాల విజిట్‌కు వెళ్లినట్లు తెలిపారు.

కోటి సహస్ర పారాయణం


పారాయణం చేస్తున్న మహిళలు

చాగలమర్రి, సెప్టెంబరు 12: చాగలమర్రి గ్రామంలోని కోదండరామాలయంలో ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ భవానమ్మ ఆధ్వర్యంలో గురువారం కోటి లలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు. బెంగుళూరులోని శ్రీ మహా ప్రత్యంగిర దేవికి సమర్పిస్తున్నామని అన్నారు. ఆలయాల్లో అందరు ఒకే సమయంలో ఏక కంఠంతో పారాయణం చేశారు. అనంతరం సీతారాములకు ప్రత్యేక పూజలు, సామూహిక వడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

జీవో 21ని రద్దు చేయాలి

బేతంచెర్ల, సెప్టెంబరు 12: జీవో నెంబర్ 21ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం, ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని లారీ వర్కర్స్ యూనియన్స్ కార్యాలయంలో లారీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి వెంకటేశ్వర్లు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవాణా రంగంపై ప్రభుత్వం భారాలు వేయడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు జె.శ్రీనివాసులు, రామకృష్ణ, రామచంద్రుడు, కోట్ల మధు, మద్దిలేటి స్వామి, తిరుమలేష్, వెంకటసుబ్బయ్య, మధుపాళం కృష్ణమూర్తి, రామళ్లకోట బాషా పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం

సంజామల, సెప్టెంబరు 12: పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఐసిడిఎస్ సిడిపిఒ మహేశ్వరమ్మ అన్నారు. గురువారం పౌష్టికా హార మాసోత్సవాన్ని పురస్కరించుకొని ముక్కమల్ల అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, విద్యార్థులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

దొర్నిపాడు, సెప్టెంబరు 12: మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారులు నాగేంద్ర, రుహుల్లాఖాన్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. వారం రోజులుగా వర్షాలు కురుస్తున్నందున ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉండటం వల్ల దోమల వ్యాప్తి జరుగుతుందని అన్నారు. దగ్గు, జలుబు, జ్వరం ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని అన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది ఉన్నారు.

బాల్య వివాహాలు నేరం: సీడీపీవో


మాట్లాడుతున్న సీడీపీవో

బేతంచెర్ల, సెప్టెంబరు 12: గ్రామాల్లోని ప్రజలు తమ పిల్లలకు బాల్య వివాహాలు చేస్తే చట్టరీత్యా నేరమని డోన్ ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్ బేగం అన్నారు. గురువారం మండలంలోని సీతారామాపురం-1 అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార ఉత్సవాలకు ఆమె హాజరై మాట్లాడారు. కార్యక్ర మంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాధమ్మ, తిమ్మమ్మ, శోభారాణి, హెచ్ ఎం, గర్భవతులు, బాలింతలు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

చాగలమర్రి: బాల్య వివాహాలను అరికట్టడం అందరి బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల తెలిపారు. గురువారం చాగలమర్రి బ్రిలియంట్ ఉన్నత పాఠశాల, ఎస్సీ కాలనీలోని 13వ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

బహుమతుల ప్రదానం

బేతంచెర్ల, సెప్టెంబరు 12: పట్టణంలోని షాదీఖానాలో గురువారం ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులకు చదువుతోపాటు జనరల్ నాలెడ్జి ఎంతో అవసరమని మండల ఖాజీ నూర్ అహ్మద్, ముర్తుజావలి, ఖాజా హుసేన్ అన్నారు.

నిర్లక్ష్యం చేయొద్దు

రుద్రవరం, సెప్టెంబరు 12 : కేంద్రప్రభుత్వం అమలు చేసిన స్వచ్ఛత హి సేవ 2024ను నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీడీవో మధుసూదనరెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

గిరిజనులకు భూములు కేటాయించాలి

రుద్రవరం, సెప్టెంబరు 12 : గిరిజనులకు భూములు కేటాయించాలని సీపీఎం నాయకుడు రామచంద్రుడు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కోటకొండ పంచాయతీ మజరా కొత్తూరు, చిన్నయ్యస్వామి గూడెంలో సభ నిర్వహించారు. సభలో ఆయన మాట్లాడుతూ ఏళ్లగా ఎలాంటి స్థిర నివాసం లేక పొలాల్లో కాపురం సాగిస్తున్న గిరిజనులకు సీపీఎం అండగా ఉంటుందన్నారు. అడవిలో లభించే తేనె, జిగురు, కుంకుడుకాయలు అడవి ఉత్పత్తులను సేకరించుకుని అమ్ముకోవడానికి గిరిజనులకు అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

పొలం వద్ద ఘర్షణ.. వ్యక్తి మృతి

శిరివెళ్ల, సెప్టెంబరు 12: మండలంలోని చెన్నూరు గ్రామంలో పొలం వద్ద జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి మృతి చెందారు. శిరివెళ్ల ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపిన వివరాలివీ.. చెన్నూరు గ్రామానికి చెందిన మేరువ పెద్ద నాగిరెడ్డి, మేరువ మహేశ్వరరెడ్డి, లక్ష్మీదేవి గురువారం సాయంత్రం తమ పొలంలో ఎక్స్‌కవేటర్‌తో కాలువ తీసుకుంటున్నారు. ఆ మట్టిని పక్క పొలం గట్టుపై పోస్తుండడంతో యజమాని బండారు పార్థసారథి అభ్యంతరం తెలుపగా వారి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో పార్థసారథి ఆయన తండ్రి బండారు సుబ్బరాయుడుకు సమాచారం అందించడంతో ఆయన అక్కడికి చేరుకున్నారు. ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరగడంతో బండారు సుబ్బరాయుడు పొలంలో కుప్పకూలిపోయారు. ఆయనను చికిత్స నిమిత్తం నంద్యాలలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సుబ్బరాయుడు మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సుబ్బరాయుడు కుమారుడు పార్థసారథి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఆళ్లగడ్డలో ఇద్దరి మృతి

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 12: ఆళ్లగడ్డ పట్టణంలోని ఆదర్శ అభ్యుదయ కాలనీలో చంద్రమోహన్(48), హుసేన్‌బాషా(70) గురువారం మృతి చెందారు. వాంతులు, విరేచనాలతో మృతి చెందినట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు నరసింహను వివరణ కోరగా వీరిద్దరూ అతిసారతో చనిపోలేదని, ఇతర అనారోగ్య కారణాల వల్ల చనిపోయారని చెప్పారు.

18న మెగా జాబ్ మేళా


పోస్టర్‌ను విడుదల చేస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, సెప్టెంబరు 12: రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో బనగానపల్లె పట్టణంలో ఈనెల 18న నిరుద్యోగ యువత కోసం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ తెలిపారు. గురువారం జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు. ఈసందర్భంగా బీసీ ఇందిరమ్మ మా ట్లాడుతూ ఎన్నికల్లో మంత్రి బీసీ ఇచ్చిన హామీ మేరకు జిల్లాలో చదువు కున్న నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 9 ప్రముఖ కంపెనీలతో 1,191 ఖాళీ పోస్టులకు ఈ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, పీజీ పూర్తి చేసిన వారు ఈజాబ్‌మేళాలో పాల్గొనడానికి అర్హులన్నారు. 18నుంచి 45 ఏళ్ల వరకు ఉండాలన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు విద్యార్హత పత్రాలు, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలతో హాజరుకావాలన్నారు. వివరాలకు 6303244165, 970599056చ 9440224291 నెంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు


దాతలు అందజేసిన నిత్యావసర సరుకులతో టీడీపీ నాయకులు

శిరివెళ్ల, సెప్టెంబరు 12 : వరద ప్రభావంతో తీవ్రంగా నష్టపోయి కష్టాల్లో ఉన్న బాధితులకు సహాయ సహకారాలు అందించడమే ధ్యేయమని టీడీపీ నాయకుడు, మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పిలుపు మేరకు విజయవాడ వరద బాధితులకు సహాయం అందించేందుకు శిరివెళ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని పలువురు దాతలు ముందుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. దాతల సహకారంతో 500 కిట్లను సిద్ధం చేసి గురువారం విజయవాడకు తరలివెళ్లారు. మహిళలకు చీరలు సైతం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుమల రవి, కొండబోయిన బాలచంద్రుడు, బ్రహ్మయ్య, కటకం శేఖర్, దువ్వూరి భాస్కర్, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

విరాళాలు సేకరించండి


కలెక్టర్‌కు నగదు ఇస్తున్న విద్యార్థులు

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 12: విజయవాడలోని వరద బాధితల కోసం విరాళాలు సేకరించాలని వెలుగు ఏపీఎం దాసన్న పిలుపునిచ్చారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఆయా గ్రామాల వీవోఏలతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల్లో ఉన్న ప్రతి మహిళ కనీసం రూ. 50కు తగ్గకుండా విరాళంగా ఇవ్వాలన్నారు. మండలం నుంచి కనీసం రూ. లక్ష వరద బాధితుల కోసం ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన తెలిపారు. సోమవారం నాటికి వందశాతం పూర్తి అయ్యేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో సీసీలు గంగన్న, నాగన్న ఉన్నారు.

- విజయవాడలోని వరద బాధితులను ఆదుకునేందుకు మండలంలోని బోడెమ్మనూరు గ్రామ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముందుకు వచ్చారు. విద్యార్థులు విరాళాల ద్వారా సేకరించిన రూ. 11 వేలు కలెక్టర్ రాజకుమారికి గురువారం అందించారు. వీరిని కలెక్టర్ అభినందించారు. వీరి వెంట పాఠశాల ఉపాధ్యాయుడు నారాయణ ఆచారి, పీడీ దాసు ఉన్నారు.

పంట నమోదు చేసుకోవాలి

శిరివెళ్ల, సెప్టెంబరు 12 : మండలంలోని రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి సుధాకర్ సూచించారు. మండలంలో ఇప్పటి వరకు 17,200 ఎకరాల పంట నమోదు పూర్తైనట్లు ఏవో తెలిపారు. గ్రామాల్లోని రైతులు ఆర్బీకేల వద్దకు వెళ్లి ఈ నెల 15వ తేదీలోగా పంట నమోదుతో పాటు ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 12: మినీ గోకులాల లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీవో ఉమమహేశ్వరరావు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పశువైద్యాధికారులు, హౌసింగ్ అధికారులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 25 యూనిట్ల మినీ గోకులాలు మంజూరు కాగా 50 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరిలో మొదట ఎస్సీ, ఎస్టీలై ఉండి ఐదు ఎకరాల్లోపు పొలం ఉన్నవారిని అర్హులుగా చేర్చుకోవాలన్నారు. సమావేశంలో ఉయ్యాలవాడ, అల్లూరు గ్రామాల పశువైద్యాధికారులు రవీంద్రారెడ్డి, సైలజ, ఉపాధి ఏపీవో రవిప్రకాష్, హౌసింగ్ ఏఈ నరసింహుడు ఉన్నారు.

మండలానికి 11,812 చెత్త బుట్టలు మంజూరు


చెత్త బుట్టలను లోపలికి తీసుకెళ్తున్న సిబ్బంది

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 12: మండలంలోని అన్ని గ్రామాలకు 11,812 చెత్త బుట్టలు మంజూరు అయినట్లు ఎంపీడీవో ఉమమహేశ్వరరావు తెలిపారు. గురువారం చెత్తబుట్టలు మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని ప్రతి ఇంటికీ రెండు బుట్టలు ఇస్తామన్నారు. వీటిలో తడి, పొడి చెత్తలను వేరుచేసి గ్రీన్ అంబాజిటర్ల ద్వారా చెత్త సంపద కేంద్రానికి తరలించి గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరుస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో శానిటేషన్ మండల కో-ఆర్డినేటర్ రమణారెడ్డి ఉన్నారు.

పైపులైన్ గుంత పూడ్చివేత


పైపులైను గుంతను పూడ్చుతున్న దృశ్యం

రుద్రవరం, సెప్టెంబరు 12 : రుద్రవరం మండలం చందలూరు గ్రామంలో చిన్నారిని దిగమింగిన పైపులైను గుంత అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైంది. ఈవోపీఆర్‌డి శ్రీనివాసశర్మ స్పందించారు. పైపులైను గుంతలు పూడ్చించామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి మౌనిక, ఇంజనీరింగ్ అసిస్టెంటు సంజనకు వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఈవోపీఆర్‌డీ తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరు కావాలి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 12: నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి శుక్రవారం నిర్వహించనున్న వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి మండలంలోని ఆయా శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఎంపీడీవో ప్రసాదరెడ్డి గురువారం తెలిపారు. రెవెన్యూ, ఐకేపీ, ఐసీడీఎస్, విద్యాశాఖ, ఇంజనీరింగ్ తదితర అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.